

ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం అమలు
దేశంలో బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ భావ జాలం అమలు చేస్తోందని టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. - 8లో



చిన్నారులకు చేయూత
కొండమల్లేపల్లిలో తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన ముగ్గురు చిన్నారులకు ప్రభుత్వం నుంచి చేయూత లభిస్తోంది. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 29°/25°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విభజన హామీల అమలులో కేంద్రం విఫలం



మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ వరంగల్ సభకు వస్తున్న సందర్భంగా మోదీ గోబ్యాక్ అంటూ శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నల్ల టీషర్ట్‌లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. పేదవారికి గుదిబండగా తయారై ఇంధనం ధరలు అదుపు చేయకుండా ఆదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచి పెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్, పాలకూరి బాబు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, నూతనకల్ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప రథయాత్రను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

సూర్యాపేట టౌన్: ఈ నెల 18న సూర్యాపేటలో నిర్వహించే పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను జయప్రదం చేయాలని పాత పెన్షన్ సాధన సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ముద్రించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రథయాత్రలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఈ రథయాత్రకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సతీష్‌కుమార్, పల్లి వీరారెడ్డి, సురభి శేఖర్, మధుకుమార్, మల్లిఖార్జున్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. ఆ తర్వాత కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పల్లెల్లో షుగర్ టెస్టులు

- గ్రామీణులకు ఉచితంగా పరీక్షలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- ఇప్పటికే పల్లె దవాఖానాలతో అందుబాటులోకి వైద్యం
- జిల్లావ్యాప్తంగా వైద్య సిబ్బందికి కిట్లు పంపిణీ



సిబ్బందికి కిట్లు అందజేస్తున్న అధికారులు

తిరుమలగిరి (తుంగతుర్తి): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉచితంగా బీపీ, షుగర్ టెస్టులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంట్లో భాగంగా ప్రస్తుతం నాన్ సీజనల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోని వైద్యసిబ్బందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసేందుకు ప్రత్యేక కిట్లు అందించారు. ఇప్పటికే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యసిబ్బంది గ్రామాలకు వెళ్లి అన్నిరకాల టీకాలు వేస్తున్నారు. వివిధ పరీక్షలు నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తున్నారు. తద్వార మెరుగైన వైద్యం అందిస్తూనే రోగుల కండీషన్‌ను బట్టి పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇకనుంచి పల్లెల్లోనే చేయబోయ బీపీ, షుగర్ నిర్ధారణ పరీక్షలతో పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాలో పీహెచ్‌సీలు	23
యూపీహెచ్‌సీలు	04
పల్లె దవాఖానాలు	122
పంపిణీ చేసిన పరీక్ష కిట్లు	327

క్యాన్సర్ లక్షణాలున్న వారిని గుర్తించి..
క్యాన్సర్‌లోని మూడు రకాలపై అవగాహన కల్పించడమే కాకుండా ప్రాథమిక లక్షణాలున్న అనుమానితుల్ని సిబ్బంది గుర్తించి వైద్యులకు సిఫారసు చేస్తారు. గుట్కా, బీడి, మద్యం సేవిస్తే వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామంలో అవగాహన కల్పిస్తారు. మంచానికే పరిమితమైన వారిని గుర్తించి ఇంటికి వెళ్లి మందులు పంపిణీ చేస్తున్నారు. అంతే కాకుండా దవాఖానాల్లో ప్రస్తుతం సాధారణ బీపీ, గర్భిణులకు పరీక్షలు, చిన్న పిల్లలకు టీకాలు, అసంక్రమటిత వ్యాధుల నిర్ధారణ చేయడంతోపాటు, మందులు పంపిణీ చేస్తున్నారు. అనుమానిత వ్యక్తుల నుంచి వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరీక్షలు చేసి రక్త, మూత్ర నమూనాలను సేకరించి సమీపంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రానికి పంపించి ఫలితాలు అందిస్తున్నారు. వాటి ఆధారంగా వైద్యసేవలు, మందులు అందిస్తున్నారు.

పేదలందరికీ వైద్య సేవలు..
ప్రభుత్వం పట్టణాల్లో బస్తీ దవాఖానాలు నెలకొల్పగా గ్రామాల్లో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు పల్లె దవాఖానాలను తీసుకొచ్చింది. ప్రాథమికంగా నిరుపేదలకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో పల్లె దవాఖానాలు పని చేస్తున్నాయి. ఇందులో భాగంగానే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతినెలా పరీక్షలు నిర్వహించేందుకు బీపీ, షుగర్ పరికరాలను పీహెచ్‌సీలకు అందజేశారు. దీని ద్వారా గ్రామాల్లో ఉప కేంద్రానికి రాలేని వారిని గుర్తించి వారి ఇంటికి వెళ్లి పరీక్షలు చేయనున్నారు.

మెరుగైన వైద్యం అందుతుంది



గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. దీంట్లో భాగంగా వివిధ రకాల పరీక్షలు చేయడమే కాకుండా ఎప్పటికప్పుడు రోగుల నుంచి సేకరించిన రక్త, మూత్రం ఆధారంగా ఫలితాలు వెల్లడిస్తున్నాం. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతూ ఆరోగ్య కేంద్రాలకు రాలేని పరిస్థితి ఉంటే సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నాం. రోగ నిర్ధారణ ఆధారంగా టీకాలు ఇస్తూ, వైద్యసేవలు అందిస్తూ మందులు పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా అధికారి



ఖిలాపై విదేశీయుల సందడి
భువనగిరి ఖిలాపై శనివారం విదేశీయులు సందడి చేశారు. అమెరికా, కెనడా, అఫ్ఘనిస్తాన్, కజకిస్తాన్, ఉగాండా, సౌదీ అరేబియా, ఇంగ్లాండ్, సిరియా, లెబనాన్ తదితర 17 దేశాలకు చెందిన 80 మంది యువతీ, యువకులు ఖిలాపై ర్యాప్లింగ్, జిప్‌లైన్ చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు ఎవరెస్ట్‌ను అధిరోహించారని పలువురు పర్యాటకులు అన్నారు.
– భువనగిరి

విరివిగా మొక్కలు నాటాలి

- కలెక్టర్ వెంకట్రావు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయ ప్రాంగణాలు, దేవాదాయ భూముల్లో హరితహారంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. శనివారం జూమ్ యాప్ ద్వారా ఎండోమెంట్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పట్టణ దేవాలయ ప్రాంగణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామాల్లో ఎంపీడీఓలు, ఎంపీఓలు హరితహార కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఫారెస్ట్ నర్సరీలు, ప్రైవేట్ నర్సరీల్లోని పెద్ద మొక్కలను దేవాదాయ భూముల్లో నాటాలని, దేవాలయాల ఆవరణలో జమ్మి, రావి, పూల మొక్కలు నాటేలా చూడాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ పనుల పర్యవేక్షణకు కేంద్రబృందాలు త్వరలో జిల్లాలో పర్యటించి గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులపై ర్యాంకింగ్ ఇవ్వనున్నందున ప్రతి ఇంటిలో స్వచ్ఛత పారామీటర్ పాటించేలా చూడాలన్నారు. అలాగే గ్రామాల్లో మురుగునీటి నిలువలు, చెత్త లేకుండా చూడాలని సూచించారు. నాలుగు నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కోసం ఈ–గోబర్ గ్యాస్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినందున వీటి నిర్మాణాలకు తక్షణమే నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీపీఓ యాదయ్య, ఎండోమెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, డీఎఫ్ఓ సతీష్ కుమార్, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎండోమెంట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభకు తరలిరండి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి



సీఎం పర్యటన రూట్‌మ్యాప్ పరిశీలిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట), సూర్యాపేట క్రైం: ఈ నెల 24న సూర్యాపేటలో జరిగే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ఎత్తున తరలిరావాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. 24న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్న సూర్యాపేట కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయం, సమీకృత మార్కెట్ ప్రాంతాలను శనివారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన రూట్ మ్యాపును పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న స్థలంలో ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు చేయాలన్నారు. భవనాల పనులు త్వరగా పూర్తి చేసి, పరిసరాలను సుందరంగా తీర్చిదిద్ది ఆయా భవనాలను అధికారులకు అప్పగించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, పోలీస్ హౌసింగ్ బోర్డు సీఈ తులసిధర, ఈఈ అబ్దుల్ ఖుద్దుఫ్ హుస్సేన్, డీఈ సుందర్, ఏఈ బాలరాజు, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, కాంట్రాక్టర్లు, తహసీల్దార్ వెంకన్న, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ సమీపంలో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎస్పీ రాజేంద్రప్రసాద్

కూలీల నోట్లో మట్టికొడుతున్న కేంద్రం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఉపాధి హామీ పథకానికి కేంద్రం ప్రతిఏటా బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తూ కూలీల నోట్లో మట్టి కొడుతోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఈనెల 18, 19 తేదీల్లో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో జరిగే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 17న ఉపాధి హామీ చట్ట రక్షణ– ఉపాధి కూలీల పాత్ర అనే అంశంపై మిర్యాలగూడలో జరిగే జాతీయ సెమినార్‌కు రాజ్యసభ సభ్యుడు శివదాసన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ.విజయ రాఘవన్, బి.వెంకట్ హాజరవుతున్నారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పులుసు సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు సోమపంగు జానయ్య, నారసాని వెంకటేశ్వర్లు, పోసనబోయిన హుస్సేన్, జిల్లా సహాయ కార్యదర్శి పఠాన్ మహబూబ్ అలీ, నల్ల మేకల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్.. చిరస్మరణీయుడు

- వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డి



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పిట్ట రాంరెడ్డి తదితరులు

చివ్వెంల(సూర్యాపేట): మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచి ఉన్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిట్ట రాంరెడ్డి అన్నారు. శనివారం చివ్వెంల మండలం జి.తిర్మలగిరి గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్ 74వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వైఎస్సార్ పాలన రావాలంటే ఆయన తనయురాలు వైఎస్. షర్మిలను గెలిపించాలని కోరారు. షర్మిల చేసిన పాదయాత్రలో పేదల కష్టాలు చూశారన్నారు. అధికార పక్షం ఎన్ని బెదిరింపులకు పాల్పడినా బెదరకుండా వైఎస్.షర్మిల ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీరెల్లి శ్రీనివాస్‌రెడ్డి, తండు భాస్కర్ గౌడ్, నల్లబోతు రాఘవరెడ్డి, లొడంగి గంగాధర్, తాడోజు జనార్దనాచారి, నెమ్మాది మల్సూర్, శాంతికుమార్, ముదిరెడ్డి లింగారెడ్డి, గోపిరెడ్డి, ఉప్పల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సవరణ షెడ్యూల్‌లో మార్పు

- ఉత్తర్వులు జారీ చేసిన ఎన్నికల సంఘం
- ఆగస్టు 21న ముసాయిదా జాబితా
- జిల్లాలో 9,14,191 మంది ఓటర్లు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఓటరు సవరణ షెడ్యూల్‌లో కొంత మార్పులు చేస్తూ ఎన్నికల సంఘం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2023 ప్రకారం ఆగస్టు 2న ముసాయిదా విడుదల చేయాల్సి ఉండగా దాన్ని ఆగస్టు 21 మార్పు చేసింది. ఎన్నికల సంఘం ప్రతి ఏడాది ఓటర్ల జాబితా సవరణకు షెడ్యూల్ ప్రకటిస్తుంది. ఎన్నికల సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో బూత్ స్థాయి అధికారి (బీఎల్‌ఓ) క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తులను స్వీకరించారు. ఈ క్రమంలో ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటికే జూన్ 23 వరకు కొత్తగా నమోదు, పేర్లలో మార్పులు చేర్పులు, తొలగింపు, ఇతర అంశాలపై అభ్యంతరాలు స్వీకరించారు.

తప్పులు లేకుండా చూడాలని..
ఎన్నికల సీజన్ కావడంతో ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలని ఇది వరకే ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా నమోదుతో పాటు తప్పులు సరిచేయడం, చనిపోయిన వారి పేర్లు తొలగించడానికి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో ఇందుకు సమయం అవసరం కావడంతో షెడ్యూల్ సవరించారు. మొదట ప్రకటించిన విధంగా కాకుండా ఓటర్ల ముసాయిదా జాబితా ఆగస్టు 21న విడుదల చేయనున్నారు.

అభ్యంతరాల పరిశీలనకు గడువు
ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన తర్వాత అభ్యంతరాలు ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 19 వరకు స్వీకరిస్తారు. వచ్చిన అభ్యంతరాలు సెప్టెంబర్ 28 వరకు పరిశీలించాలని గడువు విధించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇంకా పొరపాట్లు ఏమైనా ఉంటే అక్టోబర్ 1న పరిశీలించాలి. ఎట్టి పరిస్థితుల్లో జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై పెట్టింది.

తుది జాబితా అక్టోబర్ 4న..
తుది జాబితా మాత్రం ముందుగా ప్రకటించిన ప్రకారంగానే అక్టోబర్ 4న విడుదల చేస్తారు. ఎన్నికల సిబ్బంది ఈ మేరకు కసరత్తు చేస్తోంది. ఎన్నికల సందర్భంగా ఓటర్లు ఆందోళన చేయవద్దనే ఉద్దేశంతో ఈసారి అర్హులైన వారికి జాబితాలో అవకాశం కల్పిస్తున్నారు. చనిపోయిన వారి పేర్లను కుటుంబ సభ్యుల సమ్మతితో తొలగిస్తున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోకవర్గాల పరిధిలో మొత్తం ఓటర్లు 9,14,191మంది ఉండగా ఇందులో పురుషులు 4,52,370, మహిళలు 4,61,798, ఇతరులు 23 మంది ఉన్నారు.

జీవన నైపుణ్యాలు పెంచేలా..

- కేజీబీవీల్లో ప్రత్యేక బోధనకు కార్యాచరణ
- ఇప్పటికే కొత్త పుస్తకాల ముద్రణ
- ఆయా విద్యాలయాలకు చేరవేసిన అధికారులు



పుస్తకాలను కేజీబీవీ విద్యార్థినులకు పంపిణీ చేస్తున్న ప్రత్యేక అధికారి వెంకటరమణ

నడిగూడెం: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయా (కేజీబీవీ)ల్లో చదువుతున్న విద్యార్థినుల భవితకు బంగారు బాటలు వేయాలని ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. ప్రతి విద్యార్థినిలో ఉత్తమ నైతిక విలువలు పెంపొందిస్తూ.. జీవితం ఎదురయ్యే ఆటుపోట్లను అధిగమించేలా జీవన నైపుణ్యాలు పెంచేలా తయారు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంట్లో భాగంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రత్యేక బోధనకు శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించి ముద్రించిన జీవన నైపుణ్యాల విద్యా పుస్తకాలు ఇప్పటికే ఆయా విద్యాలయాలకు ప్రభుత్వం చేరవేసింది.

6, 7, 8 తరగతులకు..
మొదట ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా 6, 7, 8 తరగుతల విద్యార్థినులకు అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. భవిష్యత్ పరిణామాలు అంచనా వేయడం, సహచర విద్యార్థినులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులతో అనుబంధాలపై బోధన ఉంటుంది. సాధారణంగా కేజీబీవీల్లో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినులే ఎక్కువగా చదువుతుండడంతో వారిలో జీవన నైపుణ్యాలు పెంచనున్నారు. తద్వార వారికి ఆసక్తి ఉన్న రంగంలో ఆర్థికంగా నిలదొక్కుకునేలా బోధన చేయనున్నారు. ముఖ్యంగా బాలికలు లైంగిక, ఇతర వేధింపులతో పాటు, హింసను ఎదుర్కొనేలా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పరిచయం లేని వారితో ఎలా ఉండాలి అనే అంశాలతోపాటు ఇతర అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పిస్తారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులకు వారానికి మూడు తరగతులు నిర్వహిస్తారు.

బోధించే అంశాలివే..
- విద్యార్థినుల బలాలు, బలహీనతలను తెలియజేయడం, భయాలు, అవకాశాలు, లక్ష్యాలు గుర్తించేలా చేయడం.
- ఇతరుల పాత్రలోకి ప్రవేశించి ఆలోచించే నైపుణ్యం పెంచడం, కోపం, విచారం, ఉద్వోగాలను ఎలా అర్థం చేసుకోవాలి, ఎలా నియంత్రించుకోవాలి, ఎదుటి వారిలో సంయమనంతో ప్రవర్తించే పద్ధతులు తెలియజేయడం.
- సహచరుల ఒత్తిడి, భావోద్వేగాలను అర్థం చేసుకోవడం. వాటిని నియంత్రించే విధానాలను అవలంబించేలా తీర్చిదిద్దడం.
- నిత్యం ఎదురయ్యే సవాళ్లు, సమస్యలకు గల కారణాలను గుర్తించడం, ప్రత్యామ్నాయ విధాలతో పరిష్కరించడం.
- ఏదైనా సమాచారం, పరిస్థితి, సమస్యను పలు కోణాల్లో విశ్లేషించి, క్షుణ్ణంగా అర్థం చేసుకొని పరిష్కరించే సామర్థ్యాలు పెంపొందించడం.
- సమాజం పట్ల సానుకూల దృక్పథాన్ని అలవర్చడం, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావంతో ఉండేలా బోధించడం.
- సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే విభిన్న కోణాలు తెలియజేయడం.

జిల్లాలో 16 కేజీబీవీలు
జిల్లాలో మొత్తం 16 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో నడిగూడెం, మునగాల, మోతె, చింతలపాలెం, గరిడేపల్లి, పాలకీడు, పెన్‌పహాడ్, సూర్యాపేట, చివ్వెంల, నూతనకల్, మద్దిరాల, ఆత్మకూరు (ఎస్), జాజిరెడ్డిగూడెం, నాగారం, తిరుమలగిరి, తుంగతుర్తిలో ఒక్కో పాఠశాలలో దాదాపు 230 మందికి పైగా విద్యార్థినులు ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు.

పరిపూర్ణ జీవనానికి దోహదం



విద్యార్థినుల్లో ప్రతికూల ధోరణులు, ప్రమాదకర ప్రవర్తనలను నివారిస్తూ ఉత్తమంగా తీర్చిదిద్దేలా బోధించేలా ప్రణాళిక రూపొందించారు. సానుకూల వైఖరి, ఉన్నత విలువలు పెంపొందించేలా బోధనాంశాలు పొందుపర్చారు. వారి పరిపూర్ణ జీవనానికి ఇది దోహదం చేస్తుంది.

– వెంకటరమణ, ప్రత్యేక అధికారి, కేజీబీవీ, నడిగూడెం

క్లుప్తంగా

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తిరుమలగిరి (తుంగతుర్తి): ఒంటరితనాన్ని భరించలేక ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుమలగిరి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన మూల ఉపేందర్ (33) భార్య నాలుగు సంవత్సరాల క్రితం మృతిచెందింది. ఒంటరితనాన్ని భరించలేక తన ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి పక్కన ఉన్న వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి 5వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నాడు. మృతుడి అక్క చింతకింది భిక్షమమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పాము కాటుతో రైతు మృతి


మత్రు (ఫైల్)

పెద్దవూర: పాము కాటుకు గురైన గిరిజన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన శనివారం పెద్దవూర మండలంలోని కుంకుడుచెట్టుతండాలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంకుడుచెట్టుతండాకు చెందిన రమావత్ మత్రు(48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జూన్ 27న పశుగ్రాసం కోసం తన వ్యవసాయ పొలం నుంచి గడ్డి మోపు కట్టుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. మార్గమధ్యలో గడ్డి మోపులో నుంచి గుర్తుతెలియని విషపు పాము మత్రును కాటు వేసింది. ఇంటికి వచ్చాక దాహంగా ఉండటంతో మంచినీళ్లు తాగాడు. దీంతో కొద్దిసేపటికే నోటి నుంచి నురుగులు కక్కుతూ మంచంలో పడిపోయాడు. ఇది గమనించిన మత్రు కోడలు రమావత్ స్వప్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్ల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయినప్పటికీ పరిస్థితి విషమంగానే ఉండటం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా శనివారం ఉదయం కుటుంబ సభ్యులు నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి రెండో భార్య రమావత్ జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన వెంకటయ్య

గుండాల: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన శనివారం గుండాల మండలంలోని సుద్దాల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సుద్దాల గ్రామానికి చెందిన గీత కార్మికుడు బీసు వెంకటయ్య కల్లు గీసేందుకు గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారి కిందపడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వెంకటయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటయ్యను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనాథలైన చిన్నారులకు చేయూత

- ట్విట్టర్‌లో స్పందించిన మంత్రి కేటీఆర్
- మంత్రి ఆదేశాలతో వివరాలు సేకరించిన జిల్లా చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు
- చిన్నారులకు డిగ్రీ వరకు ఉచిత విద్య అందిస్తామని హామీ


చిన్నారులతో అధికారులు

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 5న భర్త సయ్యద్ రెహమాన్ అలీ చేతిలో భార్య సమీనా దారుణ హత్యకు గురైంది. కాగా నిందితుడు కూడా ఈ నెల 7న హైదరాబాద్ సమీపంలోని ఆదిభట్ల వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యాభర్తలు ఇద్దరూ మృతిచెందడంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా తెలుసుకున్న మంత్రి కేటీఆర్.. చిన్నారుల గురించిన పూర్తి వివరాలు తెలుసుకొని వారి సహాయం చేయాలని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు సూచించారు. ఈ మేరకు జిల్లా అధికారులు శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని వెంకటేశ్వరనగర్‌లో తమ అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంటున్న చిన్నారుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు చిన్నారులను గురుకుల పాఠశాలలో చేర్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పెద్ద కుమార్తె హషీఫాకు నల్లగొండలోని మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో అడ్మిషన్ ఇప్పిస్తామని, ఆమె డిగ్రీ చదివే వరకు తామే బాధ్యత తీసుకుంటామని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్(డీసీపీఓ) గణేశ్ తెలిపారు. మిగిలిన ఇద్దరు చిన్నారులు హుస్సేన్, రేయాన్‌తమను వదిలి ఉండలేదరని వారి అమ్మమ్మ, తాతయ్య తెలుపడంతో ఇద్దరు చిన్నారులకు కలిపి జాయింట్ బ్యాంక్ అకౌంట్ తీసి వారికి 18సంవత్సరాలు నిండే వరకు నెలకు రూ.4వేల చొప్పున బ్యాంక్ అకౌంట్లో జమ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముగ్గురు చిన్నారులు 18 సంవత్సరాలు నిండే వరకు తమ పర్యవేక్షణలోనే ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఐసీపీఎస్ అంజలి, ఐసీడీఎస్ తిప్పర్తి రాధ, అంగన్‌వాడి టీచర్ శోభ తదితరులున్నారు.

భూ తగాదాలో దాడి.. ఒకరు మృతి


సైదులు మృతదేహం

హాలియా: ఇరు కుటుంబాల మధ్య జరిగిన భూ తగాదాలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన అనుముల మండలంలోని యాచారం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం గ్రామానికి చెందిన బైరు చెన్నయ్య, బైరు సైదులు(65) సొంత అన్నదమ్ములు. అన్నదమ్ములకు గ్రామంలో రెండెకరాల చొప్పున వ్యవసాయ భూమి ఉంది. కాగా బైరు చెన్నయ్య పేరునే నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి పట్టా ఉండడం మూలంగా కొంత కాలంగా ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. ఇదే విషయమై శుక్రవారం వ్యవసాయ భూమి వద్ద అన్నదమ్ములు ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో బైరు చెన్నయ్య, అతడి భార్య వెంకటమ్మతో పాటు కుమారుడు కలిసి బైరు సైదులు, అతడి భార్య యాదమ్మపై దాడి చేశారు. ఈ దాడిలో యాదమ్మకు గాయాలయ్యాయి. దీంతో బాధితురాలు కుమార్తె పూజిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి యాదమ్మకు చికిత్స చేయించుకొని తిరిగి ఇంటికి వచ్చారు. శనివారం మరో మారు రెండు కుటుంబాలు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో చెన్నయ్యతో పాటు అతడి కుటుంబ సభ్యులు కలిసి సైదులు(65)ను కొట్టడంతో ఊపిరాడక కింద పడిపోయాడు. చికిత్స నిమిత్తం సైదులును వెంటనే కుటుంబ సభ్యులు నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమార్తె పూజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన..

బైరు చెన్నయ్య ఇంటి వద్ద సైదులు మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. బైరు చెన్నయ్య, బైరు వెంకటమ్మ, బైరు గణపతి, బైరు మహేష్, రామలింగం, పందుల అంజమ్మ కలిసి సైదులును కొట్టడంతోనే అతడు మృతిచెందాడని ఆరోపించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలన్నాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ట్రాక్టర్ ఢీకొని చిన్నారి దుర్మరణం


పునర్వీ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: ట్రాక్టర్ ఢీకొని చిన్నారి మృతిచెందిన ఘటన మిర్యాలగూడ మండలంలోని కాలువపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ దోరెపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలువపల్లి గ్రామానికి చెందిన దామ నాగరాజు, చంద్రకళ దంపతులకు కుమారుడు గౌతమ్, కుమార్తె పునర్వీ(4) సంతానం. శనివారం నాగరాజు తన భార్యతో కలిసి కూలీ పనులకు వెళ్లగా, గ్రామంలోని మసీదు సమీపంలో తన తాత ఇంటి వద్ద గౌతమ్ ఆడుకుంటున్నాడు. అదే సమయంలో తమ బంధువు జంగలి పిచ్చమ్మతో కలిసి రోడ్డు వెంట వెళ్తున్న పునర్వీ అన్న గౌతమ్‌ను చూసి రోడ్డు దాటుతుండగా.. గ్రామానికే చెందిన శ్రీనివాస్ ట్రాక్టర్‌లో ఇసుక లోడుతో వస్తూ పునర్వీని ఢీకొట్టాడు. దీంతో చిన్నారి తలకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారి తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బుద్ధవనం సందర్శించిన శ్రీలంక ప్రభుత్వ కార్యదర్శి


అమల్‌హర్ష దిసిల్వాను సన్మానిస్తున్న మల్లెపల్లి లక్ష్మయ్య తదితరులు

నాగార్జునసాగర్: శ్రీలంక దేశ క్రీడలు, యువజనాభ్యుదయశాఖ కార్యదర్శి డా.అమల్‌హర్ష దిసిల్వా శనివారం బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధవనంపై రూపొందించిన చిన్న వీడియోను చూసిన అమల్‌హర్ష దిసిల్వా బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లెపల్లి లక్ష్మయ్యను అభినందించారు. బుద్ధవనంలో శ్రీలంక ప్రభుత్వం బహూకరించిన 27అడుగుల అవుకన బుద్ధ విగ్రహం గురించి బుద్ధిస్ట్ ఎక్స్‌పర్ట్ కన్సల్టెంట్ డా. ఈమని శివనాగిరెడ్డి ఆయనకు వివరించారు. అనంతరం నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియంలోని సింహల విహారం తదితర ప్రాంతాలను సందర్శించారు. బుద్ధవనంలో మల్లెపల్లి లక్ష్మయ్య ఆయనను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ పత్రికా సంపాదకుడు కె. రామచంద్రమూర్తి, ఇండియన్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు బాలభాస్కర్, బుద్ధవనం ఓఎస్‌డీ కె. సుధన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రావు ఉన్నారు.

ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సాగర్


సాగర్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆత్మకూర్ మండల పరిధిలోని బొప్పారం గ్రామానికి చెందిన ఇందూరు సాగర్ ఎన్నికయ్యారు. ఈ నెల 4, 5వ తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలో నిర్వహించిన సంఘం 8వ రాష్ట్ర మహాసభల్లో సాగర్‌ను ఎన్నుకున్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో జిల్లా విద్యార్థి జేఏసీ కన్వీనర్‌గా ఆయన పనిచేశారు. సాగర్ ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మంచినూనె దందా గుట్టురట్టు

- 1040 లీటర్ల నూనె స్వాధీనం

చౌటుప్పల్: మంచినూనె ట్యాంకర్ల నుంచి అక్రమంగా నూనె తీసి అమ్ముకుంటున్న ముఠా గుట్టురట్టు చేశారు శనివారం పోలీసులు. భువనగిరి ఎస్‌ఓటీ సీఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన చెరుకు లింగస్వామి, హైదరాబాద్‌కు చెందిన లారీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ యజమాని సునీల్ కలిసి చౌటుప్పల్ మండల పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామం వద్ద అడ్డా ఏర్పాటు చేసుకొని గత కొంతకాలంగా అక్రమ మంచినూనె దందా నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే క్రమంలో వివిధ కంపెనీలకు చెందిన మంచినూనె ట్యాంకర్ల డ్రైవర్లు అడ్డా వద్దకు వెళ్లి ట్యాంకర్ల నుంచి అక్రమంగా నూనెను తీసి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో శనివారం పక్కా సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి లింగస్వామి వద్ద పనిచేసే రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు రాజ్‌కుమార్, నూనె విక్రయించేందుకు వచ్చిన ముంబైకి చెందిన ట్యాంకర్ డ్రైవర్ ప్రమోద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి వివిధ బ్రాండ్లకు చెందిన 1040 లీటర్ల ఆయిల్, 20 లీటర్ల కెమికల్‌తో పాటు నూనె తీసేందుకు ఉపయోగించే వివిధ రకాల పరికరాలను ను స్వాధీనం చేసుకున్నారు. లింగస్వామి, సునీల్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్

- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు

చివ్వెంల(సూర్యాపేట): బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో భార్య మృతిచెందగా, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండలంలోని బి.చందుపట్ల శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మోతె మండలం భళ్లుతండాకు చెందిన భుక్యా రమ (35), ఆమె భర్త వెంకన్న సూర్యాపేటలో నివాసముంటున్నారు. శనివారం వ్యవసాయ పనుల నిమిత్తం బైక్‌పై తండాకు వెళ్లి తిరిగి సూర్యాపేట వస్తున్నారు. మార్గమధ్యలో బి.చందుపట్ల శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమ అక్కడికక్కడే మృతిచెందగా, వెంకన్నకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను స్థానికులు సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మిర్యాలగూడ వాసికి డాక్టరేట్


ఉప్పల పద్మ

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఉప్పల పద్మకు ఉస్మానియా విశ్వవిద్యాలయం శనివారం డాక్టరేట్‌ను ప్రకటించింది. 'ముదిగంటి సుజాతా రెడ్డి కథలు–సామాజిక, సాంస్కృతిక దృక్పథం' అనే అంశంపై డాక్టర్ పీవీ ఉమాశశి పర్యవేక్షణలో తాను చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించినట్లు శనివారం ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. ఉప్పల పద్మను ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, సాహితీవేత్తలు అభినందించారు.

నాలుగు కార్లు ఢీ.. ఇద్దరికి గాయాలు


రోడ్డుపై పడిన కార్ల అద్దాలను హైవే సిబ్బందితో తీసివేయిస్తున్న ఎస్‌ఐ యుగేందర్

బీబీనగర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం నాలుగు కార్లు వరుసగా ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ఎర్టిగా కారు బీబీనగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోకి రాగానే డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనకే వస్తున్న మరో కారు దానిని ఢీకొట్టింది. దాని వెనకే మరో రెండు కార్లు వచ్చి ఒకదానికొకటి వరుసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా ఎయిర్ బ్యాగులు తెరుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.

గవర్నర్ వస్తుండడంతో..

అదే సమయంలో వరంగల్ నుంచి గవర్నర్ తమిళిసై హైదరాబాద్‌కు వెళ్తుండడంతో స్థానిక సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ యుగేందర్ అప్రమత్తమై నేషనల్ హైవే సిబ్బందిని, క్రేన్‌ను రప్పించి కార్లను రోడ్డ పక్కకు తీయించారు. రోడ్డుపై పడిన కార్ల అద్దాలు, ఇతర పరికరాలను పోలీసులు, హైవే సిబ్బంది తొలగించారు. దీంతో గవర్నర్ కాన్వాయ్ ఎలాంటి ఆటంకం లేకుండా వెళ్లిపోయింది.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం


సత్యనారాయణ (ఫైల్)

రాజాపేట: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన రాజాపేట మండలంలోని నెమిల గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నెమిల గ్రామానికి చెందిన ఊట్కూరి సత్యనారాయణ(39)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. జీవనోపాధి కోసం భువనగిరిలోని ఓ రైస్‌మిల్లులో గుమాస్తాగా సత్యనారాయణ పనిచేస్తున్నాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతో మస్తాపానికి గురైన సత్యనారాయణ శనివారం సాయంత్రం రాజాపేట మండలంలోని బేగంపేట శివారులో చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానిక రైతు గమనించి గ్రామ సర్పంచ్‌కు తెలుపగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపానికి గురై..

సూర్యాపేట క్రైం: మనస్తాపంతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం సూర్యాపేట పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఎన్‌టీఆర్ కాలనీలో నివాసముంటున్న భారత నరేందర్(50) భార్య 20సంవత్సరాల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి అతడు ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల సదరు మహిళ నడవడికలో మార్పును గమనించిన అతడు అది తట్టుకోలేక మస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తన డైరీలో తన చావుకు కారణమైన ముగ్గురు వ్యక్తుల పేర్లు రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి తల్లి అంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

మిద్దె తోటల పెంపకంతో ఆరోగ్యం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రఘోత్తమ్‌రెడ్డి

మునగాల: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే మిద్దె తోటల పెంపకం చేపట్టాలని మిద్దె తోటల పెంపకం రూపకర్త తుమ్మేటి రఘోత్తమ్‌రెడ్డి అన్నారు. శనివారం మునగాల మండలంలోని ఆకుపాముల శివారులో గల అగ్రి నెక్ట్స్ గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో మిద్దె తోటల పెంపకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కూరగాయల పెంపకంలో రోజురోజుకు రసాయనాలను అధికంగా వినియోగిస్తున్నారని, దీంతో ప్రజలు రకరకాల జబ్బుల బారిన పడుతున్నారన్నారు. ప్రతి కూరగాయ పంటకు మోతాదుకు మించి రసాయనాలు ఉపయోగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పనికిరాని ప్లాస్టిక్ డబ్బాలను ఉపయోగించి మిద్దెలపై మడులను ఎలా ఏర్పాటు చేసుకోవాలి, మిద్దె తోటలకు కావాల్సిన మట్టి, సేంద్రియ ఎరువులు, విత్తనాలు, చీడపీడల నివారణ పద్ధతులు, ఆకుకూరల ప్రాధాన్యత తదితర అంశాలపై రఘోత్తమ్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రి నెక్ట్స్ గ్రామీణ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్, విశ్రాంత వ్యవసాయ సంచాలకుడు నరసింహారావు, కుటుంబ మాధవి, పందిరి నాగిరెడ్డి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం అమలు చేస్తున్న బీజేపీ

- తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య


వివేక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్నన్న అభ్యుదయవాదులు

సూర్యాపేట: ఆర్‌ఎస్‌ఎస్ భావజాలమే భారత భావజాలంగా బీజేపీ అమలు చేస్తోందని తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. 2015లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన విప్లవోద్యమ నాయకుడు వివేక్ 8వ వర్ధంతి సభను శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలోని ప్రస్తుత పరిస్థితులు–పౌర సమాజం పాత్ర అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భిన్నత్వంలో ఏకత్వం భావనకు తిలోదకాలు ఇస్తూ తినే తిండి, కట్టే బట్ట మీద కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోందన్నారు. అనంతరం వీడియో కాల్ ద్వారా సీనియర్ జర్నలిస్ట్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో రాజ్యాంగ ఆశయాలకు భిన్నమైన పాలన నడుస్తున్నా.. పౌర సమాజం నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడం లేదన్నారు. సమాజం ప్రస్తుతం ఉన్న దశ నుంచి హీనస్థితికి దిగజారకుండా ఉద్యమించాలన్నారు. వివేక్ అమరత్వం నుంచి ప్రశ్నించడం నేర్చుకోవాలని కోరారు. ఆ తర్వాత ప్రముఖ పాత్రికేయుడు మల్లారెడ్డి మాట్లాడుతూ.. అత్యంత మానవీయ ఉద్యమంలోకి వెళ్లి వివేక్ అమరుడు కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్ డేవిడ్, వివేక్ తల్లిదండ్రులు యోగానంద్– మాధవి, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, బుద్ధ సత్యనారాయణ, కొత్తపల్లి శివకుమార్, పోలెబోయిన కిరణ్, సుదర్శన్, మాధవి, రమాదేవి, కావలి యాదయ్య, కోటయ్య, మాధవరెడ్డి, నాగరాజు, సుభాని, భద్రయ్య, అరుణజ్యోతి, సంధ్య, రేపాక లింగయ్య పాల్గొన్నారు.

వేరుశనగ సాగుకు 'వానాకాలం' అనుకూలం

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు

పాడి పంట


వేరుశనగ పంట

నడిగూడెం: వానాకాలంసీజన్ వేరుశనగ పంట సాగుకు అనువైన సమయమని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు అన్నారు. వేరుశనగ సాగుకు అనుకూలమైన నేలలు, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం ఇంకా పలు సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

- **నేలలు, నేల తయారీ:** ఇసుకతో కూడిన గరప నేలలు, నీరు త్వరగా ఇంకిపోయే ఎర్ర చెల్క నేలలు వేరుశనగ సాగుకు చాలా అనుకూలమైనవి. ఎక్కువ బంకమన్ను కలిగిన నల్లరేగడి నేలల్లో ఈ పంట వేయరాదు. వేసవిలో లోతు దుక్కులు చేయడం వలన పంటను నష్టపరిచే కీటకాలు, తెగుళ్ల ఉధృతిని తగ్గించుకోవచ్చు. విత్తే ముందు నేలను మెత్తగా దుక్కి చేసి చదును చేయాలి.
- **విత్తుకునే సమయం:** వేరుశనగ పంటను జూన్ మొదటి పక్షం నుంచి జూలై రెండో పక్షం వరకు విత్తుకోవచ్చు. ఈ పంటను యాసంగిలో అయితే సెప్టెంబరు మొదటి పక్షం నుంచి నవంబరు 30 వరకు విత్తుకోవచ్చు.
- **విత్తన మోతాదు:** ఎంచుకొనే రకం, గింజల బరువు, విత్తే సమయాన్ని బట్టి విత్తే మోతాదు నిర్ణయించుకోవాలి. కదిరి–6, లేపాక్షి –1218, విత్తనాలు 50 నుంచి 60 కిలోలు ఎకరానికి విత్తుకోవచ్చు.
- **విత్తనశుద్ధి:** కిలో విత్తనానికి 1.0 గ్రాముల టెబ్యుకొనగాజోల్, 3 గ్రాముల మ్యాంకోజెబ్ పొడి మందును పట్టించాలి. కాండం కుళ్లు తెగులు ఆశించే ప్రాంతాలలో కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడ్రాక్లోప్రిడ్ మందుతో కలిపి విత్తనశుద్ధి చేయాలి. వేరుపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో కిలో విత్తనానికి 6.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేక ఇమిడాక్లోప్రిడ్ 2 మి.లీ. చొప్పున కలిపి శుద్ధి చేయాలి.
- **విత్తే దూరం:** వానాకాలంలో విత్తినప్పుడు వరుసల మధ్య 30 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. యాసంగిలో నీటి పారుదల కింద సాగు చేసేటప్పుడు వరుసల మధ్య 22.5 సెం.మీ, మొక్కల మధ్య 10 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి.
- **విత్తే పద్ధతి:** గొర్రుతో లేదా నాగలి సాళ్లలో లేదా ట్రాక్టర్‌తో నడిచే సీడ్ డ్రిల్ యంత్రంలో విత్తనాలు విత్తుకోవాలి. విత్తే సమయంలో నేలలో తగినంత తేమ ఉండాలి. విత్తనాన్ని 5 సెం.మీ. లోతు మించకుండా విత్తుకోవాలి. ట్రాక్టర్‌తో నడిచే సీడ్ డ్రిల్‌ను వాడినట్లయితే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తుకోవడమే కాక, ఖర్చును కూడా తగ్గించుకోవచ్చు. ఈ పద్ధతిలో ఒక ఎకరాన్ని రెండున్నర నుంచి మూడు గంటల్లో విత్తుకోవచ్చు.
- **ఎరువుల యాజమాన్యం:** భూసార పరీక్షను అనుసరించి ఎరువుల మోతాదును నిర్ణయించుకోవాలి. ఆఖరి దుక్కిలో ఒక ఎకరానికి 3–4 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలి. అలాగే ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోలు పొటాష్ మరియు 18 కిలోల యూరియా విత్తే సమయంలోనే వేసుకోవాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలి పూత దశలో మరో 10 నుంచి 15 కిలోల యూరియాను వేసుకోవాలి. ఎకరానికి 200 కిలోల జిప్సమ్‌ను పూత దశ పూర్తయి ఊడలు దిగే సమయంలో మొదళ్ల వద్ద వేసి మట్టిని ఎగదోయాలి. విత్తిన 45 రోజుల తర్వాత ఎటువంటి అంతర సేద్యం చేయరాదు. నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించుటకు 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంద్రనాశినిని 100 కిలో పశువుల ఎరువులో కలిపి ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.
- **కలుపు నివారణ:** కలుపు నివారణకు సిఫారసు చేసిన మందులను సిఫారసు చేసిన దశలలో వాడాలి. విత్తిన 25–30 రోజుల దశలో గొర్రుతో అంతరకృషి చేసుకోవాలి. అలాగే మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోయాలి. విత్తిన 45రోజుల వరకు ఎలాంటి కలుపు లేకుండా చూసి ఆటుపై ఎలాంటి అంతర సేద్యం చేయకూడదు లేనిచో ఊడలు దెబ్బతిని దిగుబడులు తగ్గుతాయి.
- **నీటి యాజమాన్యం:** వేరుశనగ పంటకు మొత్తం 450–600 మి.మీ. నీరు అవసరమవుతుంది. తేలిక నేలల్లో 6–8 తడులు ఇవాల్సి ఉంటుంది. విత్తే ముందు నేల బాగా తడిసేలా నీరు పెట్టి తగినంత పదును ఉన్నప్పుడు విత్తనం వేసుకోవాలి. రెండవ తడిని విత్తిన తర్వాత మొలక వచ్చిన 20–25 రోజులకు ఇవ్వాలి. తర్వాత తడులు నేల లక్షణం, బంక మట్టి శాతంను అనుసరించి 7–10 రోజుల వ్యవధిలో ఇవ్వాలి. చివరి తడిపంట కోతకు 4–7 రోజుల ముందు ఇవ్వాలి.
- పైరు ఊడలు దిగే దశ నుంచి కాయలు ఊరే దశ వరకు సున్నితమైనది కాబట్టి ఈ దశలో నీరు సక్రమంగా తగు మోతాదులో నీరు పెట్టాలి. నీటిని తుంపర్ల ద్వారా ఇచ్చినట్లయితే దాదాపు 25 శాతం నీరు ఆదా అయి అధిక దిగుబడి, నాణ్యమైన కాయలు తీసుకోవచ్చు.

- **అంతర పంటలు:** వేరుశనగ పంటలో అంతర పంటలుగా కంది, మొక్కజొన్న, సజ్జ తదితర వాటిని సాగు చేసుకోవచ్చు.
- **పంట కోత:** వేరుశనగ మొక్కల్లోని 75 శాతం కాయలు పూర్తిగా పక్వానికి వచ్చినప్పుడే కోయాలి. కాయల్లోని లోపలి భాగం ముదురు గోధుమ వర్ణంలోకి మారినప్పుడు కోతకు వచ్చిందని గుర్తించాలి. పంట కోత తర్వాత, వేరుశనగ కాయలను మొక్కల నుంచి వేరు చేయడానికి వెట్‌పాడ్ లేదా డ్రై పాడ్ త్రెషరును ఉపయోగించవచ్చు. ఈ యంత్రాల ద్వారా ఒక గంటలో రెండున్నర క్వింటాళ్ల కాయలను మొక్కల నుంచి వేరు చేయవచ్చు.